## క్లుప్తంగా

### వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



**ఉరవకొండ:** స్థానిక చాబాల రోడ్డు వద్ద ఉన్న చెరువు కట్ట సుంకలమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుంకలమ్మ అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టిన అనంతరం యంత్ర ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పట్టణంలో ఊరేగించారు. బొమ్మిశెట్టి నారాయణస్వామి, బొమ్మశెట్టి లక్ష్మి దేవి జ్ఞాపకార్థం వీరి కుమారులు నగేష్‌బాబు–లావణ్య, మురళి–స్వప్న ధ్వజస్తంభ ఏర్పాటుకు సహకరించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు విశ్రాంత ఏఎస్‌ఐ శ్రీరాములు, సుంకన్న, సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

### ఆలయ అభివృద్ధికి నిధులు



రూ.4 లక్షలను ఈఓకు అందజేస్తున్న నాయకులు

**బొమ్మనహాళ్:** మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలోని మారెమ్మ దేవి, గౌరమ్మ దేవి ఆలయాల పునరుద్ధరణ కోసం ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక నిధులను కేటాయించిదని ఎంపీపీ పద్మ, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల శ్రీధరఘట్ట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు మారెమ్మ దేవి, గౌరమ్మ దేవి ఆలయాలు దెబ్బతిన్నాయని, మరమ్మతు చేయించాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి గ్రామస్తులు విన్నవించారు. స్పందించిన ఆయన ఎండోమెంట్ అధికారులతో మాట్లాడి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల వంతున మంజూరు చేయించారు. అందులో భాగంగా గురువారం మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ ఒక్కో ఆలయానికి రెండు లక్షల చొప్పున రూ.4 లక్షలు ఆలయ ఇన్‌చార్జి ఈఓ బాబు అందజేసి బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు వారు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన విప్ కాపు రామచంద్రారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### వలంటీర్లకు నియామక పత్రాలు

**కూడేరు:** మండలంలో కొత్తగా నియమితులైన వలంటీర్లకు ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా గురువారం నియామక పత్రాలు అందజేశారు. కూడేరుకు అంజలి, ఇప్పేరుకు ఎర్రిస్వామి, కొర్రకోడుకు రాజశేఖర్‌లను ఎంపిక చేశారు. మరుట్లకు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ మీ పరిధిలో 50 కుటుంబాలకు అందుబాటులో ఉంటూ సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

### హోంగార్డుకు గాయాలు



హోంగార్డును 108లో తీసుకెళ్తున్న దృశ్యం

**కూడేరు:** విధి నిర్వహణలో భాగంగా కూడేరు పోలీసు స్టేషన్ నుంచి ఉరవకొండలోని సర్కిల్ ఆఫీస్‌కు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న హోంగార్డు నరసింహులు గురువారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఉరవకొండ మండలం ముష్టూరు వద్దకు వెళ్లగానే అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై జింక అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. అతడిని 108లో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



75 వీరాపురం జగనన్న లేవుట్‌ను పరిశీలిస్తున్న నోడల్ అధికారి శంకర్

**గుమ్మఘట్ట:** జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నోడల్ అధికారి, డీఎల్‌డీఓ శంకర్ సూచించారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో జగనన్న లే అవుట్‌లను ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగమణితో కలసి ఆయన పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఇంటి నిర్మాణాల స్థాయిని బట్టి బిల్లులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని సచివాలయాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత, పంచాయతీ కార్యదర్శులు శ్వేతపద్మిని, రాజేష్, తేజస్విని, మోహన్, డీఏ మహేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ‘దుర్గం’లో ‘తెలుగు తమ్ముళ్ల’ వికృతక్రీడ!

- మహిళలపై బరితెగించి వ్యవహరిస్తున్న టీడీపీ వర్గీయులు
- మండిపడుతున్న మహిళా సంఘాలు



**రాయదుర్గం:** జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గంలో టీడీపీ వర్గీయుల వికృత క్రీడకు కొందరు మహిళలు బలవుతున్నారు. తెలుగుతమ్ముళ్లు బరితెగించి వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో రాఖీ పౌర్ణమి ముందు ఆ తర్వాత జరిగిన రెండు ఘటనలే ఇందుకు నిదర్శనం. డి హీరేహాళ్ మండలంలోని హులికల్లులో కుమార్తె వయసు కలిగిన ఓ యువతి పై టీడీపీ నాయకుడు బోయ సోమశేఖర్ పట్టపగలే అత్యాచారం చేశాడు. ఆ తర్వాత కుటుంబసభ్యులకు పట్టుబడడంతో దేహశుద్ధి చేశారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని జైలుకు పంపారు. ఈ ఘటన మరవకముందే రాయదుర్గం మండలం డి.కొండాపురంలో మరో సంఘటన వెలుగు చూసింది. టీడీపీ నాయకుడి కుమారుడు బోయ మోహన్ అదే గ్రామంలో బెస్త నరేష్ భార్య లావణ్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. తరచూ భార్యతో సాగిస్తున్న రాసలీలలు చూస్తూ నరేష్ భరించలేక పోయాడు. ఎదిరించే దమ్ములేక చూస్తూ ఉండలేక ఆఖరుకు ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా అతడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. వివాహేతర సంబంధానికి శాశ్వతంగా అడ్డు తొలగించుకోవాలనే కుట్రతో ‘చచ్చిపోవాలంటూ’ పలు మార్లు ఒత్తిడి తీసుకురావడంతోనే విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన అర్బన్ సీఐ లక్ష్మన్న కేసు నమోదు చేశారు. అయితే మరిన్ని అనుమానాలు వ్యక్తం కావడంతో రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీకి (ఆర్ఎఫ్ఎస్ఎల్) నివేదిక పంపారు. ఆ వివరాలు నిర్ధారణ కావాల్సి ఉంది. మృతుడి భార్య లావణ్య, అక్రమ సంబంధం కొనసాగిస్తున్న టీడీపీ నాయకుడు బోయ మోహన్‌పై కేసు నమోదు చేసి పోలీసులు జైలుకు పంపారు. వీరిద్దరు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులకు ప్రధాన అనుచరులు కావడంతో చర్చకు దారితీసింది. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఇద్దరు పిల్లలను వజ్రకరూరు మండలం గడేకల్లులో ఉంటున్న నానమ్మ, తాతయ్యల వద్దకు తీసుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై సర్వాత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పలు కఠిన చట్టాలు అమల్లోకి తీసుకొచ్చినా టీడీపీ నాయకులు మాత్రం బేఖాతరు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. మాజీ మంత్రి కాలవ అండతోనే కొందరు టీడీపీ నాయకులు రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. పోలీసులు ఇలాంటి ఘటనల్లో నిందితులపై ఉక్కుపాదం మోపి బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తిచేశారు. ఏదిఏమైనా సభ్యసమాజం తలదించుకునే ఈ పనులు సరైనవి కాదని ప్రజలంతా ముక్త కంఠంతో ఖండించారు.

### నేడు గ్రామ సచివాలయం ప్రారంభం

**డి హీరేహాళ్(రాయదుర్గం):** డి హీరేహాళ్–2 గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, సర్పంచ్ హెచ్ లక్ష్మి గురువారం తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ ముఖ్య నాయకులు హాజరు కావాలన్నారు.

### కొనసాగుతున్న నిరసన

**కూడేరు:** తమ డిమాండ్ల సాధన కోసం మండలంలోని సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ పథకం కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 7వ రోజుకు చేరింది. కార్మికులు అర్ధ నగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నేతలు శ్రీరాములు, ఆంథోన్ రెడ్డి, శ్రీనివాసులు, చిన్న త్రిలోకనాథ్, శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ప్రాజెక్ట్ పరిధిలో పని చేస్తున్న 572 మంది విధుల్లోకి చేరమని తెగేసి చెప్పారు.

# జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

- ‘గడప గడపకూ మన ప్రభుత్వం’లో విప్ కాపు రామచంద్రారెడ్డి



పులచెర్లలో బ్రోచర్‌ను అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

**కణేకల్లు:** జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమపథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. మండలంలోని పులచెర్ల గ్రామంలో గురువారం ‘గడప గడపకూ మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ రవి, రవిప్రకాష్‌రెడ్డి, బషీర్, రవిచంద్రతో కలిసి విప్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజలకు మంచి చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు, కాలవ శ్రీనివాసులు ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. ఐదేళ్ల పాలనంతా ప్రజాధనం దోచుకొనేందుకే సరిపోయిందన్నారు. మంచి చేసే జగనన్నకు తోడుగా ఉండాలని విప్ కోరారు.

**ఏడు గంటల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**

ఎస్సీ కాలనీలో లో ఓల్టేజీ సమస్యను ఉదయం 9గంటలకు కాలనీవాసులు విప్ దృష్టికి తెచ్చారు. సార్.. చాలా రోజుల నుంచి ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన కాపు సాయంత్రం 4గంటల కల్లా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి ప్రారంభించారు. విప్ కాపు తీసుకొన్న చొరవ... స్పందించిన తీరు చూసి గ్రామస్తులు ‘థ్యాంక్యూ విప్ సార్’ అంటూ ఆనందం వ్యక్తం చేశారు. కాగా గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకుడు ధనుంజయ్య ఇంటికెళ్లగా... తమకు జగనన్న ఏమీ ఇవ్వలేదని బుకాయించారు. వివిధ పథకాల ద్వారా రూ.4.55 లక్షలు, ఇటీవలే పంట బీమా ద్వారా రూ.1.30 లక్షలు మొత్తం రూ.5.85 లక్షలు చేకూరిన లబ్ధి గురించి వివరాలతో బ్రోచర్‌లో విప్ కాపు చూపారు. లబ్ధి పొంది కూడా లేదని బుకాయించే ప్రయత్నం చేసిన వారిని చూసి ప్రజలు పెదవివిరిచారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, ఎంపీపీ హెచ్.సంధ్య, ఎంపీటీసీ గంగమ్మ, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ నాగరాజు, హంపీ, అంబాపురం భాస్కర్‌రెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, దూదేకుల మహమ్మద్, ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, వేమన, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతరావు, సర్మస్, పర్వతరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు భూమి పూజ



రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



గోపాల కృష్ణ మూలవిరాట్ వద్ద పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

**ఉరవకొండ:** మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రూ.25 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి భూమి పూజ చేశారు. లక్ష్మీనృసింహస్వామి కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజురైన రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాల సాయినగర్, వాల్మీకి కళ్యాణ మండపం వెనుక 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షతో నిర్మిస్తున్న పైప్‌లైన్ పనులకు మాజీ ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈసందర్భంగా విశ్వ మాట్లాడుతూ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైప్‌లైన్ నిర్మాణ పనులు రూ.7 కోట్లతో చేపట్టామన్నారు. కార్యక్రమంలో బెస్త, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు రమణ, గోవిందు, వెంకటేష్, ఎంపీపీ చందా చంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య పాల్గొన్నారు.

**వైభవంగా గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ట**

**ఉరవకొండ:** స్థానిక బళ్లారి బైపాస్‌లోని దేవాంగ ఫంక్షన్ హల్ వెనుక వైపు ఉన్న గోపాల కృష్ణ ఆలయంలో మహగణపతి సహిత గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు చేపట్టారు. అనంతరం ఉరవకొండ తాలుకా యాదవ సంఘం, పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాగా గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, పార్టీ నాయకులు బసవరాజు, యాదవసంఘం నాయకులు పాల్గొన్నారు.

## ● అనుబంధాలకు ప్రతీక ‘రాఖీ’



కళ్యాణదుర్గం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాఖీ కదుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్





ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే విశ్వకు రాఖీ కడుతున్న మహిళా నేతలు, కూడేరు: ఎస్‌ఐ సత్యనారాయణకు రాఖీ కదుతున్న సంచాలకురాలు వేదావతి

**కళ్యాణదుర్గం రూరల్:** రక్షా బంధన్ సందర్భంగా తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ రాఖీ కట్టి.. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

**ఉరవకొండ:** రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి ఉరవకొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, వెంకటాంపల్లి సర్పంచ్ కమలమ్మ తదితరులు రాఖీలు కట్టారు.

**కూడేరు:** రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఈశ్వరీ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లోని అధికారులకు మండల సంచాలకురాలు వేదావతి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

**బ్రహ్మసముద్రం:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బసవరాజు అన్నారు. గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి మండల పరిషత్ పాఠశాలలో జగనన్న గోరుముద్దను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుసప్ప , పాఠశాల కమిటీ చైర్మన్ శరణప్ప , తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### యువకుడికి విద్యుత్ షాక్

**కళ్యాణదుర్గం రూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో గురువారం ఉదయం విద్యుత్ షాక్ తగిలి యువకుడు హనుమప్ప గాయపడ్డాడు. వివరాలు.. గరుడాపురం గ్రామానికి చెందిన హనుమప్ప ముదిగల్లులో బంధువుల ఇంటికి వచ్చాడు. ఉదయం లేవగానే ఇంటి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ ప్రవహిస్తున్న వైరు తగిలి హనుమప్పకు షాక్ కొట్టడంతో కింద పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### పశువులకు టీకాలు

**శెట్టూరు:** మండలంలోని చింతర్లపల్లిలో పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు అందజేశారు. పశువైద్యాధికారి సాయి సుమంత్, సిబ్బంది 123 పశువులకు టీకాలు వేశారు. ముద్ద చర్మ వ్యాధి నివారణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. తెల్ల రంగు పశువులకు ఈ వ్యాధి సోకుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఎర్రిస్వామి, గోవిందు, , సాయి కుమార్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

### రైతుల రాస్తారోకో

**కణేకల్లు:** మండలంలోని యర్రగుంట, జక్కలవడికి, గెనిగెర, కణేకల్లుక్రాస్ తదితర గ్రామాలకు కరెంటు సరఫరా సక్రమంగా లేదు. దీంతో బోర్లకింద సాగు చేసిన మిర్చి, పత్తి తదితర పంటలు నీళ్లలేక ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులు గురువారం రాస్తారోకో చేశారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని రైతులను నచ్చచెప్పారు. సమస్యను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. సక్రమంగా కరెంటు వచ్చేలా చూసామన్నారు.

# సత్వరమే గండి పూడ్చేలా చర్యలు

**కణేకల్లు:** కర్ణాటకలోని కొలగల్లు వద్ద హెచ్చెల్సీకి పడిన గండిని సత్వరమే పూడ్చేలా చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పులచెర్లలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు వద్ద హెచ్చెల్సీకి పైపింగ్ పడితే వెంటనే పూడ్చివేయించామన్నారు. కర్ణాటక పరిధిలో ఉన్న హెచ్చెల్సీ కాలువకు రూ.వేల కోట్లతో ఆధునీకరణ పనులు చేసినా కొలగల్లు వద్ద గండి పడటం బాధాకరమన్నారు. అయినప్పటికీ తుంగభద్రబోర్డు కార్యదర్శి, తుంగభద్ర డ్యామ్ ఎస్ఈతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకొని నీటి సరఫరాను పునరుద్ధరించేలా చేశామన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టు రైతులకు మేలు చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తుంటే పిచ్చికుక్క కరిసిన వ్యక్తిలా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు నోటికొచ్చినట్లు మాట్లాడం దారుణమన్నారు. ఐదేళ్లు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీవు చీఫ్ విప్‌గా... రాష్ట్ర మంత్రిగా పని చేశావు... అప్పుడెందుకు హెచ్చెల్సీ గురించి పట్టించుకోలేదని కాపు ప్రశ్నించారు. ఐదేళ్లు ప్రజాధనం దోపిడీలో బిజీగా ఉండి అవినీతిలో నిండా కూరుకొనిపోయిన నీవు... ఓ అసమర్థత నాయకుడిగా మిగిలిపోయావని విరుచుకుపడ్డారు. నీ వెధవ డ్రామాలు ప్రజలు పట్టించుకోరని రాబోవు ఎన్నికల్లో నిన్ను నీ పార్టీకి బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోయరవి, రవిప్రకాష్‌రెడ్డి, బషీర్, రవిచంద్ర, హంపీ తదితరులు పాల్గొన్నారు.



స్విచ్ ఆన్ చేసి నీరువిడుదల చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

**కాపు చొరవతో జగనన్న కాలనీకి నీటి వసతి**

**కణేకల్లు:** మండలంలోని యర్రగుంట గ్రామ శివారులో కొత్తగా ఏర్పాటవుతున్న జగనన్న కాలనీకి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నీటి సౌకర్యం కల్పించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. విప్ ఆదేశాల మేరకు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి గత మూడ్రోజుల నుంచి 11 బోర్లు వేయించారు.. చివరికి మరో బోరు వేయగా వారి ప్రయత్నం ఫలించింది. గురువారం జగనన్న కాలనీకొచ్చిన విప్ కాపు అప్పటికప్పుడే విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి కరెంటు వైరింగ్ పనులు చేయించి స్విచ్ ఆన్ చేసి నీరు విడుదల చేశారు. మాటిచ్చి... నిలబెట్టుకోవడంతో గృహ నిర్మాణదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, నాయకులు కురుబ ఈరన్న, గొల్లభీమిరెడ్డి, హనుమంతరాయుడు, చిప్పిగిరి హనుమంతరెడ్డి, అగలూరప్ప, చక్రపాణి, వంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, జక్కలవడికి రమేష్ పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని భంభంస్వామి ఆశ్రమంలో గురువారం పౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా స్వామికి ప్రత్యేక ఫాతేహ పఠించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పౌర్ణమి సందర్భంగా ఆశ్రమానికి విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు బషీర్ అహ్మద్, మహబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### వాటర్ ప్లాంట్ సందర్శన

**కళ్యాణదుర్గం రూరల్:** మండలంలోని హులికల్లు గ్రామంలో ఆర్డీటీ అండతో రెండు సంవత్సరాల క్రితం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం దాతలు సందర్శించారు. నిర్మించారు. వాటర్ ప్లాంట్ నిర్మించాక హులికల్లు గ్రామంలో నీటి సమస్య తగ్గిందని కమిటీ సభ్యులు అన్నారు. అనంతరం దాతలను సన్మానించారు.

# పట్టణ పేదలకు ఆరోగ్య భరోసా

- నేడు రెండు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రారంభం
- హాజరుకానున్న ప్రభుత్వ విప్ కాపు

**రాయదుర్గంటౌన్:** ఒకప్పుడు సర్కారు దావాఖానాకు నేను రాను బిడ్డో అనే పరిస్థితులు ఉండేవి. వైద్యులు ఉండేవారు కాదు. వసతులు శూన్యం. ఫలితంగా పేద రోగులు ప్రభుత్వాస్పత్రులకు వచ్చేందుకు జంకుతుండేవారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో చేపట్టిన విప్లవాత్మకమైన మార్పులతో పరిస్థితి పూర్తిగా మారింది. ఆస్పత్రుల ఆధునీకరణ, వైద్యుల నియామకం, వసతుల కల్పనతో పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. ప్రతి 25 వేల మంది జనాభాకు ఓ హెల్త్ క్లినిక్ ఉండాలనే ఆశయంతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసి నడుపుతున్నారు. రాయదుర్గం పట్టణంలో మూడు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల శాశ్వత భవన నిర్మాణాలకుగాను ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ.80 లక్షలు కేటాయించి మొత్తం రూ.2.40 కోట్లతో నిర్మాణాలు చేపట్టింది. ఇటీవల భంభంస్వామి లేఅవుట్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. తాజాగా పట్టణంలోని బీటీపీ రోడ్డు మాడ్రన్ లేఅవుట్, కణేకల్లు రోడ్డు గౌడ లేఅవుట్‌లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న మరో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను శుక్రవారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, డీఎంహెచ్ఓ హాజరై ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవనున్నారు.

**వైద్య సేవలు మరింత చేరువ**

అర్బన్ హెల్త్ సెంటర్లతో పట్టణ పేదలు, శివారు కాలనీల్లో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ అవుతున్నాయి. ఒక్కో కేంద్రంలో ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డీటీఓలను నియమించి సేవలందిస్తున్నారు. కేంద్రాల్లో వైద్యసేవలతోపాటు ఆరోగ్య సంబంధమైన అన్ని వివరాలను నమోదు చేస్తారు. గర్భిణులకు అన్ని రకాల సేవలను అందజేస్తున్నారు. హైరిస్క్ కేసులను పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు.

### మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

**కుందుర్పి:** మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎస్కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు అన్నారు. గురువారం ట్రస్టు ఆధ్వర్యంలో చెట్టుకు కృతజ్ఞతగా వృక్షాబంధన్ కార్యక్రమం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోని విలువల బడుల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుందుర్పి, జంబుగుంపల, మలయనూరు తదితర పంచాయతీల్లో ట్రస్టు ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలను నాటారు. ట్రస్టు సభ్యులు దిలీప్, శ్రీకాంత్, ఉమాదేవి, సౌమ్య, మల్లి, చంద్ర, లక్ష్మణమూర్తి, బొమ్మలింగ తదితరులు పాల్గొన్నారు.

### రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని కోటలో ఉన్న రాఘవేంద్రస్వామి ఆలయంలో 352వ ఆరాధనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరగనున్న ఆరాధనోత్సవాల్లో భాగంగా మొదటిరోజు గురువారం స్వామి పూర్వారాధన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూలవిరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భజన కార్యక్రమం, ప్రాకారోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి మధ్యారాధన కార్యక్రమం, శనివారం ఉత్తర ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భక్త మండలి సభ్యులు తెలిపారు.